9.10.1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 41 విడిప్రతి రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి



TIMEWEL
JAPANESE TECHNOLOGY QUARTZ WATCHES
ఆథరైజ్డ్ A-1 డీలర్:
బాలాజి వాచ్ కంపెనీ
కాపువీధి ఎదురు, ట్రంకురోడ్డు, నెల్లూరు
ఫోన్: 324423, 332178

# ఎన్నికల హింస ప్రారంభం!

ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి పి. ఇంద్రారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచి, జైలుకు పంపారు. ఆయన చేసిన నేరం - ఒక దళితుడ్ని కులం పేరుతో దూషించడం; సందర్భం - ఆ దళితుడు ఇంద్రారెడ్డి వద్దకు వెళ్లి ఇళ్ల స్థలాలు కావాలని అడిగాడట; అందుకాయన అన్నె చూద్దాంలే అని బదులిచ్చాడట; ఆ దళితుడు ఆ సమాధానంతో తృప్తిపడకుండా నువ్వు రోజుకొక పార్టీ మార్చి ప్రజల్ని మర్చిపోతున్నావని నిలదీశాడట; దానితో కోపం వచ్చిన ఇంద్రారెడ్డి ఆ దళితుడ్ని కులం పేరుతో తిట్టాడట! ఈ నేరానికి సాక్షులు - ఇంద్రారెడ్డి గన్‌మ్యాన్‌లు!

ఎంత అందమైన కథ అల్లారో చూడండి పోలీసులు. ఎక్కడో ఏదో సభలో ఎమ్మెల్యే పాల్గొనేటప్పుడు ఎవరో ముక్కు ముఖం తెలియని దళితుడు ఎదురు రావడం,

**ఇంద్రారెడ్డి అరెస్ట్ రాష్ట్రవ్యాప్తంగా జరుగనున్న రాజకీయ దౌర్జన్యాలకు సంకేతం!**

అతడ్ని ఎమ్మెల్యే తిట్టడం, అందుకాయన్ను అరెస్ట్ చేసి జైలుకు పంపడం ఎంత విచిత్రంగా వుంది? నిజానికిందులో విచిత్ర పడాల్సినదేమీ లేదు; రేపటి ఎన్నికలలోగా రాజకీయ ప్రత్యర్థులను అణగ ద్రొక్కడానికి తెలుగుదేశాధినేతలు జరుపనున్న రాజకీయ వ్యూహానికి ప్రథమ సంకేతం ఇది! మొన్నటి మంత్రి వర్గ విస్తరణలోనే - జరుగనున్న ఎన్నికల హింసకు సూచన అందజేశాడు చంద్రబాబు. ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటరుగా గుర్తింపు పొందిన కృష్ణ యాదవ్‌ను; హత్యానేరంతో సహా పలు క్రిమినల్ కేసుల్లో వాయిదాలకు కోర్టుకు హాజరవుతున్న దేవినేని వెంకటరమణను మంత్రులను చేయడంలో ముఖ్యమంత్రి వుద్దేశ్యం అదేననడం తెలిసిన సంగతే! తమ పార్టీ బలహీనంగా వుందని భావించిన ప్రాంతాలన్నింటిలో ఆయన ఇదే వ్యూహం

కొరవ 7వ పేజీలో

తృటిలో ప్రమాదం తప్పించుకున్న 'ఈనాడు' విలేఖరి!

# పత్రికా విలేఖర్లు వస్తే కట్టల క్రింద పాతేయండి!

మనుబోలు మండలం కొలనుకుదురు గ్రామంలో రొయ్యల భూముల దురాక్రమణలను రక్షించడానికి చివరికంటా పోరాడాలనే నిశ్చయానికి వచ్చినట్లున్నారు - రాపూరు ఎమ్మెల్యే ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి గారు. కలెక్టర్ శ్రీమతి వై. శ్రీలక్ష్మి ఆ పట్టాల రద్దుకు పట్టుబట్టడంతో ఎంతకైనా తెగించడానికి సిద్ధపడ్తున్నా రాయన.

ఆక్రమణ భూముల్లో నిర్మించిన రొయ్యల చెరువులను చదును చేయించమని కలెక్టర్ చేసిన ఉత్తర్వులను ఎమ్మార్వో లక్ష్యపెట్టలేదు. రెవిన్యూ మంత్రి నుంచి ఎమ్మెల్యే తెప్పించిన స్టే ఆధారంగా దురాక్రమణదారులకు అభయం లభించింది! అయితే స్టే ఆర్డరు వచ్చింది - కేవలం

**కండ్లేరు భూముల దురాక్రమణదారులకు రాపూరు ఎమ్మెల్యే హుకుం జారీ చేశారట!**

అప్పటికి రొయ్యల పెంపకం ప్రారంభమైన చెరువులకు మాత్రమే. కాని ఎమ్మార్వో,

కొరవ 7వ పేజీలో



శ్రీ వై.యస్. రాజశేఖరరెడ్డి
పి.సి.సి. అధ్యక్షులు.

## రాష్ట్రకాంగ్రెస్ రథసారధికి స్వాగత సుమాంజలి



స్వర్గీయ ఇందిరాగాంధీ
మాజీ ప్రధానమంత్రి



స్వర్గీయ రాజీవ్‌గాంధీ
మాజీ ప్రధానమంత్రి



శ్రీమతి సోనియాగాంధీ
ఏ.ఐ.సి.సి. అధ్యక్షురాలు



శ్రీ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి
కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు

యువతరం ఆశాజ్యోతి, రాష్ట్ర కాంగ్రెస్ జీవన జ్యోతి,
ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, కడప పార్లమెంటు సభ్యులు
**డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డిగారు**
కాంగ్రెస్ విజయ యాత్రకై చేపట్టిన పాదయాత్ర కార్యక్రమాలలో
భాగంగా రేపు (10-10-98) నెల్లూరు జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా

## స్వాగతం - సుస్వాగతం





మాదాసు గంగాధరం
మాజీ యం.యల్.సి.

జి.కె. రెడ్డి
పి.సి.సి. ప్రత్యేక ఆహ్వానితులు.

